## క్లుప్తంగా

### వెంకటరమేష్‌కు అడ్వైజర్ అవార్డు

పాల్వంచ: పాల్వంచ కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల అడ్వైజర్ పి.వెంకటరమేష్‌కు 'మోస్ట్ అడ్మైర్డ్ అకడమిక్ అడ్వైజర్ అవార్డు'లభించింది. ఈనెల 21న హైదరాబాద్‌లో తాజ్ డెక్కన్‌లో జరిగిన ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్–2024 కార్యక్రమంలో ఆసియా టుడే మీడియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ప్రతిష్టాత్మకమైన 'మోస్ట్ అడ్మైర్డ్ అకడమిక్ అడ్వైజర్'అవార్డును తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా వెంకట రమేష్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు బండారు లక్ష్మణ్, ఈటెల రాజేందర్, రఘునందన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కె.నాగమణి మంగళవారం వెంకటరమేష్‌ను అభినందించారు.

### పోస్టర్లు విష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఎన్డీ రెండువర్గాల విలీన సభ పోస్టర్లను ఇల్లెందులోని కొత్త బస్టాండ్‌లో ఆవిష్కరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు మాట్లాడుతూ.. వివిధ కారణాలతో విడిపోయిన ఎన్డీలోని వైకే వర్గం, ఎన్డీ సాధినేని వర్గం ఈ నెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో జరగనున్న సభలో కలవనుందని తెలిపారు. నాగేశ్వరరావు, జే.సీతారామయ్య, తుపాకుల నాగేశ్వరరావు, ముక్తి సత్యం, ఉమర్, కె.సారంగపాణి, ఎండీ రాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### టీబీ నిర్మూలనకు సహకరించండి..



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఇల్లెందురూరల్: టీబీ నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత అన్నారు. టీబీ వ్యాధి నిర్మూలనకు వంద రోజులుగా చేపట్టిన కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కల్పిస్తూ మంగళవారం కొమరారం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. టీబీ లక్షణాల కనిపిస్తే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీని సందర్శించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారికి ప్రభుత్వమే ఉచితంగా మందులు అందజేస్తుందని చెప్పారు.

### ఘనంగా ఇరుముడి పూజలు



ఇరుముడితో భవానీ మాలధారులు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం భవానీదీక్షాపరులు ఇరుముడి పూజలు ఘనంగా నిర్వహించారు. 50మంది దీక్ష తీసుకున్న మాతలకు అర్చకులు అమ్మవారి సన్నిధిలో ఇరుముడి పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీనివాస్, రమేష్ దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### ద్విచక్రవాహనం చోరీ

పాల్వంచరూరల్: ఇంటి వద్ద పార్కింగ్ చేసిన ద్విచ్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని సోములగూడెం క్రాస్‌రోడ్డు వద్ద నివాసం ఉంటున్న పెయింటర్ కాపుల మహేశ్ సోమవారం రాత్రి తన ఇంటి వద్ద ద్విచక్రవాహనం (పల్సర్)పార్కు చేశాడు. తెల్లవారుజామున నిద్రలేచి చూసేసరికి బైక్ కన్పించలేదు. మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనదారుడిని ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో గాయపడ్డాడు. ఈ ఘటన నాగారం కాలనీ వద్ద చోటుచేసుకుంది. మంగళవారం నాగారంకాలనీ వద్ద తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై వెళ్తున్న చర్ల మండలం పూజారిగూడెం గ్రామానికి చెందిన, భద్రాచలం ఐటీడీఏలో తాత్కాలిక ఉద్యోగం చేస్తున్న కుర్ల రాము కలెక్టరేట్‌లో పని నిమిత్తం పాల్వంచకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రున్ని భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాము సోదరుడి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ బోడ చంటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# యేసు జననం.. ఆధ్యాత్మిక తోరణం

- నేడు క్రిస్మస్ పర్వదినం
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- విద్యుత్‌కాంతులతో ప్రత్యేక అలంకరణ



టేకులపల్లి: విద్యుత్ దీపాల అలంకరణలో సులానగర్ మేరీమాత మందిరం

ఇల్లెందురూరల్: పశువుల పాకలో పుట్టిన 'వేగుచుక్క'లోకానికి ఆధ్యాత్మిక వెలుగుబాట చూపింది. రెండువేల సంవత్సరాలకు పూర్వం జరిగిన ఈ ఘటన ప్రపంచగతిని మార్చేసింది. సమాజాన్ని శాంతి, కరుణ, దయ, క్షమ వైపు నడిపించింది. పాపులను కడిగేందుకు ఆధ్యాత్మిక రంగం ఆరంభమైంది. సుదీర్ఘకాలంగా ఆధ్యాత్మిక బోధనలను పంచుతూ క్రైస్తవులను ప్రభువు చూపిన మార్గంలో నడిపిస్తూ.. శాంతి, కరుణ, సాటి వారిని ప్రేమించమన్న క్రీస్తు బోధనలను ప్రజల దరికి చేరుస్తూ సమాజ హితానికి మతగురువులు పాటుపడుతున్నారు.

**శోభాయమానంగా చర్చిలు..**

పాల్వంచ: యేసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకుని క్రిస్మస్ ఆరాధనలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆలయాల్లో మంగళవారం రాత్రి బుధవారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

భక్తులు చర్చిలకు అధిక సంఖ్యలో రానుండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాల్వంచలోని ఆర్‌సీఎం (ఆరోగ్యమాత) చర్చి, కేటీపీఎస్ కాలనీలోనీ సీఎస్ఐ, మార్కెట్ ఏరియాలోని బెరాకా, కాంట్రాక్టర్స్ కాలనీలోని ఎల్‌జీఎం, పాత పాల్వంచ, నవభారత్ ఏరియాల్లోని సీఎస్ఐ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

టేకులపల్లి: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని వివిధ సంఘాలకు చెందిన చర్చిలు ముస్తాబు చేశారు. పాస్టర్ల ఆధ్వర్యంలో భక్తులు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. నేడు ఘనంగా వేడుకలు జరగనున్నాయి.

పాల్వంచరూరల్: క్రిస్మస్ పర్వదినం సందర్భాంగా మండలంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. కిన్నెరసాని, ఉల్వనూరు, సూరారం, పాండురంగాపురం, దంతలబోరు ఎస్సీ కాలనీ, లక్ష్మీదేవిపల్లి తదితర గ్రామాలలోని చర్చిలను విద్యుత్ దీపాలు, స్టార్లతో అలంకరించారు. క్రిస్మస్ సందర్భంగా ఫాదర్లు నేడు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

జూలూరుపాడు: మండలంలో క్రిస్మస్ పండుగ వాతావరణం నెలకొంది. బుధవారం జరగనున్న క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. చర్చిలను రంగురంగుల విద్యుత్‌దీపాలు, చమ్కీలు, రంగుకాగితాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి నుంచి చర్చిల్లో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఫాదర్లు, పాస్టర్లు అన్ని ఏర్పాట్లు చేశారు. చర్చిలలో ఏసు జన్మించిన పశువుల పాకలను తయారు చేశారు. ఇప్పటికే క్రైస్తవులందరూ ఇళ్లపై రంగురంగుల స్టార్లను పెట్టుకున్నారు.

**విద్యా సంస్థల్లో...**

పాల్వంచ: పట్టణంలోని పలు పాఠశాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక త్రివేణి, శ్రీ విద్యా పాఠశాలల్లో బాల యేసు పశువుల పాక సెట్టింగ్‌లు, స్టార్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు శాంతా క్లాజ్ దుస్తులతో అలరించారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి పాఠశాలలో మంగళవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు ఎంజిల్స్, శాంతాక్లాజ్‌ల వేషధారణలతోపాటు పశువుల పాకలో బాల యేసు, క్రిస్మస్ ట్రీ, ఈఫిల్ టవర్ విద్యుత్ కాంతుల అలంకరణలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రాంనగర్‌లోని ఎస్ఆర్‌డీజీ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్ జోనల్ ఇన్‌చార్జ్ సతీష్ హాజరై మాట్లాడారు. ఎస్ఆర్‌డీజీ పాఠశాలలో కులమతాలకు అతీతంగా ప్రతీ పండుగ విశిష్టతలను తెలుపుతూ విద్యార్థులకు వివిధ సంస్కృతి సాంప్రదాయాలను పరిచయం చేయడం విద్యలో ఒక భాగమని, ఇందులో భాగంగానే ఈనాటి సెమీ క్రిస్మస్ వేడుకలు అని తెలిపారు. కార్యక్రమంలో బాలయేసు ఆగమనాన్ని తెలుపుతూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఇల్లెందు: పట్టణంలోని జేకే సింగరేణి గ్రౌండ్‌లో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మంగళవారం విమల, ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సుదర్శన్ కోరీ, రాకం శ్యాంబాబులు ముఖ్యఅతిథులుగా హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.



కొత్తగూడెంఅర్బన్: ఎస్ఆర్‌డీజీ పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో..



పాల్వంచ: త్రివేణి పాఠశాలలో..



పాల్వంచ: విద్యుత్ కాంతుల్లో ఆర్‌సీఎం చర్చి

### సత్యమార్గం ఉత్తమం..



యేసుకు ఇష్టమైనది సత్యమార్గం. దానిని అనుసరిస్తేనే క్రిస్మస్ అంతరార్థాన్ని నెరవేర్చినట్లవుతుంది. జీవితంలో ఎన్ని కష్టాలెదురైనా జడవకుండా, సత్యమార్గాన్ని విడవకుండా ఉన్న వారికి దేవుని కృప ఎల్లప్పుడూ ఉంటుంది.

– అనిల్‌కుమార్, మామిడిగూడెం చర్చి పాస్టర్, ఇల్లెందు

### చీకటిని పారదోలాలి



చీకట్లను పారదోలుతూ యేసు జన్మించారు. దైవ కుమారుడి వలే ప్రతి ఒక్కరూ తమ హృదయంలో నెలకొన్న అజ్ఞానపు చీకట్లను పారద్రోలాలి. అప్పుడే నిజమైన క్రీస్తు పుట్టిన రోజును జరుపుకున్నట్లు.

– దినేష్, పోలారం చర్చి పాస్టర్, ఇల్లెందు

### ఆధ్యాత్మికత అవసరం..



ప్రజలను అజ్ఞానం నుంచి వెలుగు వైపు నడిపించిన యేసు ప్రభువు జన్మదినాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి. చెడు ఆకర్షణకు గురికాకుండా ఆధ్మాత్మిక సంపదను సొంతం చేసుకోవాలి.

– తోకల ఇమ్మానియేల్, చర్చి రొంపేడు పాస్టర్

### పాప ప్రక్షాళనకే..



సకల పాపాలను ప్రక్షాళన చేసేందుకు పశువుల పాకలో పుట్టిన యేసు తన రక్తంతో సర్వపాపాలను కడిగివేశారు. ఆయన పుట్టిన రోజును ప్రతి ఒక్కరూ పాపాలు చేయబోమని ప్రతినబూనాలి. దేవుని ఆజ్ఞకు బద్దులై జీవించాలి. ఆదే దైవకుమారునికి మనమిచ్చే కానుక.

– బీమాపాల్, రాఘబోయినగూడెం చర్చి పాస్టర్

### యేసు జననం లోకానికి రక్ష..



యేసుక్రీస్తు జననం లోకానికి రక్షణ దినంగా చెప్పుకుంటాం. పశువుల పాకలో నుంచి ప్రపంచానికి మార్గదర్శిగా వచ్చారు. ప్రేమ, కరుణ, దయాగుణం ఆయన చూపిన మార్గం అనుసరణీయం. డిసెంబర్ 25న క్రీస్తు పుట్టినరోజును ప్రపంచమంతా ఎంతో సంతోషంగా పండుగగా జరుపుకుంటుంది.

– విజయరావు, ఆర్‌సీఎం చర్చి ఫాదర్, పాల్వంచ

### క్రిస్మస్ కానుకలేవి?

టేకులపల్లి: గత ప్రభుత్వం దసరా సందర్భంగా రేషన్ కార్డుదారులందరికీ బతుకమ్మ చీరలు, ముస్లింలకు రంజాన్ కానుకగా కొత్త బట్టలు, విందు కోసం నగదు, క్రైస్తవులకు క్రిస్మస్ కానుకగా దుస్తులు, విందు కోసం నగదు అందజేసిన విషయం తెలిసిందే. బుధవారం క్రిస్మస్ పండుగ నేపథ్యంలో క్రైస్తవులకు ప్రభుత్వం నుంచి క్రిస్మస్ కానుకలు ఇప్పటి వరకు ఇవ్వకపోవడం గమనార్హం. గతంలో క్రిస్మస్ సందర్భంగా ఒక్కో కుటుంబానికి ఇచ్చే కానుక ప్యాకెట్‌లో పురుషుల కోసం ప్యాంటు, షర్టు, మహిళలకు చీర, జాకెట్, పంజాబీ డ్రెస్ ఉండేవి. దీంతో ఎంతో సంతోషంగా పండుగ జరుపుకునేవారు. ప్రస్తుతం కానుకలు ఇవ్వకుండా విందు కోసం కేవలం రూ.40వేలు కేటాయించారు. అది కూడా పండుగ అయిపోయిన తరువాత ఈనెల 30న ఎమ్మెల్యే సమక్షంలో విందు కార్యక్రమం నిర్వహించుకునేందుకు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. టేకులపల్లి మండలంలో సుమారు వివిధ సంఘాల పేర్లతో 50 వరకు చర్చిలు ఉన్నాయి. వంద మంది పాస్టర్లు దైవ సేవలో ఉన్నారు. ప్రతీ సంవత్సరం లాగా ఈ సంవత్సరం క్రిస్మస్ కానుకలు ఇవ్వక పోవడంతో క్రైస్తవులు నిరాశలో ఉన్నారు.

### సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి..

టేకులపల్లి: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్‌టీల సమస్యల పరిష్కారానికి సహకరించాలని సీఆర్‌టీలు, నాయకులు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో కోయగూడెంలోని నివాసంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... మినిమం టైం స్కేలు ఇవ్వాలని, 61 సంవత్సరాల ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలకు మెటర్నటీ సెలవులు, ప్రతీ నెల ఐదో తారీకు లోపు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలనే డిమాండ్లతో చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. హరిలానాయక్, కస్నానాయక్, భూక్యా లక్ష్మణ్, భూక్యా మంగీలాల్ నాయక్, రాందాస్, వీరన్న పాల్గొన్నారు.

### బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రవి

పాల్వంచరూరల్: సూరారం గ్రామానికి చెందిన బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా భూక్యా రవినాయక్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్‌నాయక్ మంగళవారం పదవీ భాద్యతలు అప్పగించారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి..



కలెక్టర్, ఎస్పీ, సింగరేణి చైర్మన్‌ల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మొక్కల రాజశేఖర్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సోమవారం రాత్రి జరిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో అతిథులైన కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.బలరామ్‌ల చేతుల మీదుగా పర్యావరణ పరిరక్షకుడు, సింగరేణి ఉద్యోగి మొక్కల రాజశేఖర్‌ను అభినందిస్తూ మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుదూ... పర్యావరణ పరిరక్షణ కోసం ప్రముఖులకు, అధికారులకు, రాజకీయ నాయకుల జన్మ, పుట్టినరోజులకు మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పే సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన రాజశేఖర్‌ను అభినందించారు. సొంత డబ్బులతో పర్యావరణ దీక్ష చేపట్టిన రాజశేఖర్‌ను అదర్శంగా తీసుకొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పీఅండ్‌పీ వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు, జీఎంలు కోడూరు శ్రీనివాస్‌రావు, సుభాని, కవితా నాయుడు, సెంట్రల్ వర్క్‌షాపు జీఎం దామోదర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యాదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వస్తువులు పొందే హక్కు ఉంది

కొత్తగూడెంఅర్బన్: డబ్బు చెల్లించి నాణ్యమైన వస్తువులను పొందే హక్కు ప్రతీ వినియోగదారుడికి ఉందని తెలంగాణ వినియోగదారుల, సమాచార హక్కుల చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జూలూరి రఘుమాచారి అన్నారు. మంగళవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బస్టాండ్ ఏరియాలో జరిగిన సమావేశంలో రఘుమాచారి మాట్లాడారు. వస్తువు సేవలో నాణ్యత – సేవ లోపం జరిగినప్పడు జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందే హక్కు ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వినియోగదారుడికి హక్కులు కల్పిస్తూ చట్టాన్ని తెచ్చిందని, అది ప్రస్తుతం వినియోగదారుల పరిరక్షణ చట్టంగా మార్పు చెందిందన్నారు. వినియోగదారులు తప్పనిసరిగా వారు కొనుగోలు చేసే వస్తువుల, సేవల బిల్లులు తీసుకోవాలని, తద్వారా వినియోగదారుల కమీషన్లలో వస్తువుల, సేవల లోపాలపై ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందన్నారు. వినియోగదారులు వారి హక్కులు తెలుసుకొని చైతన్యవంతంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు నాగేశ్వరరావు, చంద్రశేఖరచారి, ఎల్లయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, రమేష్, యాదగిరి, రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం



టేకులపల్లి కేజీబీవీ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 15 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెను పట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం విమర్శించారు. కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో మంగళవారం సమ్మె శిబిరాన్ని సందర్శించి జిల్లా కమిటీ తరపున సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సమస్యలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే జిల్లా వ్యాపితంగా విద్యార్థులు రోడ్డెక్కాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మందా నాగకృష్ణ, సీహెచ్ రామ్‌చరణ్, బి.సాయి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: కేజీబీవీలో పని చేస్తున్న సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ సమస్యలు పరిష్కరించి వారిని వెంటనే విధుల్లోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బయ్యా అభిమన్యు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టేకులపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో 15 రోజులుగా టీచర్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న బాలికలు మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేజీబీవీ ఎదుట ఆందోళనకు దిగారు. మాకు టీచర్లు కావాలి.. పాఠాలు బోధించాలి.. సిలబస్ పూర్తి చేయాలి.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అభిమన్యు మాట్లాడుతూ... సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలోని కేజీబీవీ టీచర్లు ధర్నాకు దిగడంతో విద్యా బోధన జరగడం లేదన్నారు. పదోతరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో 15 రోజులుగా టీచర్లు లేకపోవడంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గానీ, దేశంలో అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం గానీ ప్రతిపక్ష పార్టీలు గానీ కనీసం స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి టీచర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి విద్యార్థులకు క్లాసులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాదావత్ ఉదయ్, సింధు, మౌనిక, సుధ, ప్రవళిక, మధు, కల్యాణి విద్యార్థినులు పాల్గొన్నారు.

### ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక ప్రాంతమైన రామవరంలోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో నూతనంగా శివాలయం, పార్వతీదేవి, కుమారస్వామి దేవతామూర్తుల దేవాలయాలకు 26వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాంత ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై స్వామి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### పల్లెలకు బస్ సర్వీసులు నడపండి..

ఇల్లెందు: ఆర్టీసీ ప్రవేశపెట్టిన పల్లె వెలుగు బస్‌లు పట్టణాల్లోనే పరుగులు తీస్తున్నాయి. పల్లెల్లో ప్రయాణికులు ఎక్కటం లేదని పల్లెలకు బస్‌లు నడపటం లేదు. ఇదిలా ఉండగా ఇల్లెందు కేంద్రంగా బస్‌డిపో ఏర్పాటు చేసినా తమ పల్లెలకు బస్ సదుపాయం లేదంటూ ప్రజలు డిపో ఎదుట ఆందోళనలు చేస్తున్నారు. తాజాగా మంగళవారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఇల్లెందు బస్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. డిపో మేనేజర్ సంజీవరాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు మాట్లాడుతూ... బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ సాగుతోందన్నారు. ఏళ్లు గడిచినా పల్లెలకు బస్‌లు నడపడం లేదన్నారు. తక్షణం మారుమూల గిరిజన ప్రాంతాలకు బస్ సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ కోటేష్, యదళ్లపల్లి సావిత్రి, ధరావత్ దేవా, కోరం ముత్తక్క, యమునా, సుశీల, బుజ్జి, రామీ, అజ్మీరా సిరి, సుగుణ, శారద, సుభద్ర, గడ్డం ఉపేంద్ర, ఈసం భద్రమ్మ, జోగ జయ, పూనెం ఎర్రమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

## 26న హైదరాబాద్‌లో టీపీటీఎఫ్ ధర్నా



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముఖ్యమంత్రి సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం, గిరిజన సంక్షేమ శాఖ సీఆర్‌టీల రాష్ట్ర నాయకత్వాన్ని చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్, ఉపాధ్యాయదర్శిని సంపాదకవర్గ సభ్యులు ఎం.రామాచారి, జిల్లా కార్యదర్శి బి.రమేష్ కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద సమ్మె శిబిరం వద్ద మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 26న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ డి.చెన్నారావు, ఎస్ఎస్ఏ ఉద్యోగ నాయకులు, సీఆర్‌టీలు ఆనంద్, పార్వతి, భాస్కర్‌రావు, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందాలి..



ఆస్పత్రిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ఇల్లెందు: ప్రభుత్వ వైద్యశాలకు వచ్చేది పేదలే.. వారికి మెరుగైన వైద్యం అందించాలి, ఈ ప్రభుత్వం పేదల వైద్యం కోసం ఎంతో కృషి చేస్తోంది, డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండి ఆస్పత్రికి వచ్చిన ప్రతీ రోగికి సకాలంలో వైద్యం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రభుత్వ డాక్టర్లకు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా ప్రభుత్వాస్పత్రిని సందర్శించి పరిశీలించారు. అన్ని వార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును, సూపరింటెండెంట్ డాక్టర్ జి.హర్షవర్ధన్‌ను వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కౌన్సిలర్ గిన్నారపు రజిత, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, పడిదల నవీన్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థినులకు స్వీయ రక్షణలో శిక్షణ



కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు

టేకులపల్లి: పాఠశాల దశలోనే విద్యార్థినులు స్వీయ రక్షణలో శిక్షణ తీసుకుంటే రాబోయే ప్రమాదాలు, జరగబోయే దాడుల నుంచి తమని తాము రక్షించుకోవచ్చని టేకులపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మెరుగు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆడపిల్లలకు స్వీయ రక్షణ కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మరక్షణ శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం టేకులపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం ప్రారంభించారు. కరాటే మాస్టర్ మొగిలి బాలికలకు ఆత్మ సంరక్షణకు మెళకువలు నేర్పించారు. వారంలో మూడు రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని మాస్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, పుష్పావతి, శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గ్రామకార్యదర్శి కాశి సూచించారు. పాండురంగాపురం తండా గ్రామంలో మంగళవారం పెసా చట్టం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతీ కార్యక్రమాన్ని ప్రజలు ముందుంచుతామన్నారు. గ్రీన్‌ఎర్త్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ రాథోడ్ మాట్లాడుతూ... చట్టాలు ఎన్ని ఉన్నా అధికారి సక్రమంగా అమలు చేసినప్పుడే ఆ చట్టం లక్ష్యం నేరవేరుతుందన్నారు. 5వ షెడ్యూల్డ్ ఏరియా ప్రాంతాలకు అమలు చేసిన పెసా చట్టంపై అవగాహన చేసుకోవాలన్నారు. గ్రామసభ ద్వారా గిరిజన అచారాలు, సంప్రదాయాలు, చట్టాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బానోతు మంగ్యా, గుగులోత్ కిషన్, రాజేంద్రప్రసాద్, ఇస్లావత్ లాలు పాల్గొన్నారు.